# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

## (ప్రారంభం)

1

**చికాగోనించీ** లండన్ గాట్విక్ ఎయిర్పోర్టుకి వచ్చిన విమానం దిగి, లగేజ్ తీసుకుని అప్పుడే బయటికి వచ్చింది సమీర.

అక్కడే బయట ఎదురు చూస్తున్న జెస్సికా, సమీరని చూడగానే పరుగెత్తుకుంటూ వచ్చి "హాయ్! సమీ, బాగున్నావా? ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి" అని ఒక్కసారిగా సమీరని కావలించుకున్నది.

"అవును. నాలుగేళ్ల క్రితం నువ్వు చికాగో వదిలేసి ఇక్కడికి వస్తున్నప్పుడే చూడటం. నువ్వు ఏమీ మారలేదు. అలాగే సన్నగా, చక్కగా వున్నావు" అంది సమీర జెస్సికాని కన్నార్పకుండా చూస్తూ.

సన్నగా, చాల పొడుగ్గా, తెల్లటి శరీరం మీద బంగారం రంగు జుట్టుతో ఎంతో అందంగా వుంటుంది జెస్సికా.

నవ్వింది జెస్సికా. "నువ్వు మాత్రం? ఏమీ మారలేదు. అలాగే వున్నావ్. నిజం చెప్పాలంటే మునుపటి కన్నా ఇంకా అందంగా వున్నావు" అంది.

జెస్సికా అన్నదాంట్లోనూ నిజం వుంది.

కొంచెం చామనచాయతో సన్నగా, పొడుగ్గా చక్కటి పలువరుసతో సమీర ఎంతో హుందాగా, అందంగా వుంటుంది. చిరునవ్వులు చిందిస్తుంటే ఇంకా బాగుంటుంది.

సమీర కూడా నవ్వి, "సరేలే, మనిద్దరం ఒకళ్ళనొకళ్ళు పొగుడుకుంటూ ఇక్కడ నుంచుంటే ఎలా! వచ్చే పోయే వాళ్లకి దారిలో అడ్డంగా వున్నాం. పద, వెడదాం!" అంది.

"నా కారు ఇటు పక్క పార్క్ చేశాను" అంటూ పార్కింగ్ లాట్ వేపు దారి తీసింది జెస్సికా.

కారు ఎక్కాక అడిగింది జెస్సికా, "ప్రయాణం బాగా జరిగిందా?" అని.

"బాగానే వుంది కానీ, విమానంలో నాకు నిద్రపట్టదు. మూడు సినిమాలు చూశాను" అంది సమీర.

"ఒక పని చేద్దాం. నిన్ను మా ఎపార్ట్మెంటులో దించి నేను ఆఫీసుకి వెడతాను. నేను మధ్యాహ్నం రెండున్నర, మూడు గంటల లోపునే వచ్చేస్తాలే! మా బాసుకి ముందే చెప్పాను, నా మంచి స్నేహితురాలు వస్తున్నదని. బాబ్ కూడా కొంచెం ముందుగానే వచ్చేస్తానన్నాడు. మేం వచ్చేదాకా హాయిగా నిద్రపో. విశ్రాంతి తీసుకో" అంది జెస్సికా.

"మరి నేను ఇవాళా, రేపు మీతో వుండి, ఎల్లుండి ఆదివారం బర్మింగ్హామ్ వెళ్ళాలి. మళ్ళీ సోమవారం ప్రొద్దున్నే యూనివర్సిటీలో వుండాలి కదా!" అంది సమీర.

జెస్సికా నవ్వింది. "అలాగే. ఇవాళా రేపూ ఇక్కడ నీ ప్రోగ్రాం అంతా ఫిక్స్ అయిపోయింది. ఆదివారం ఇక్కడినించీ బర్మింగ్హాంకి నిన్ను ప్లేన్ ఎక్కించే బాధ్యత నాది. మధ్యాహ్నం నేను వచ్చాక మాట్లాడుకుందాం" అంది.

జెస్సికావుండే ఎపార్ట్మెంట్ గాట్విక్ ఎయిర్పోర్టుకి దగ్గరే.

ఇరవై నిమిషాల్లో ఎపార్ట్మెంటుకి చేరుకున్నారు.

జెస్సికా వుండేది రెండు బెడ్రూముల చిన్న ఎపార్ట్మెంట్.

జెస్సికా సమీర లగేజిని రెండవ బెడ్రూములో పెట్టింది.

ఫ్రిడ్జ్ తెరిచి, దాంట్లో వున్నవన్నీ చూపించింది. ముఖమాటం లేకుండా ఏం కావాలంటే అవి తీసుకు తినమన్నది. బాత్రూం, టవల్స్ అన్నీ ఎక్కడెక్కడ ఏమేం వున్నాయో చూపించింది.

"నాకు టైమయింది.. మధ్యాహ్నం కలుద్దాం" అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది.

అమెరికాలో ఇలాటి మర్యాదలు అలవాటే కనుక, సమీరకి ఇవేవీ కొత్తగాలేవు.

కాఫీ కలుపుకుని, ముందు గదిలోని సోఫాలో కూర్చుని కాఫీ త్రాగుతూ కూర్చున్నది.

పక్కనే వున్న టేబుల్ మీద పెట్టిన బాబ్, జెస్సికాల పెళ్లి ఫోటో చూసి, దాన్ని చేతుల్లోకి తీసుకుని చూసింది. జెస్సికా అందంగా నవ్వుతూ నుంచుని వుంది. ఆమె పక్కనే చిరునవ్వుతో నుంచుని వున్నాడు బాబ్.

వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుంది సమీర.

గత స్మృతులు అలా మనసులోకి వస్తూనే వున్నాయి.

ఇరవై ఎనిమిదేళ్ళ క్రితం చికాగోలో పుట్టింది సమీర. తల్లిదండ్రులు తెలుగువారే అయినా, అమెరికాలో పుట్టి పెరగటం వల్ల, అన్నీ అమెరికా పద్ధతులతోనే పెరిగింది. నాలుగైదుసార్లు ఇండియా వెళ్ళినా, అదొక విదేశంలాగానే వుండేది సమీరకి. అక్కడ వున్న వారం పదిరోజులూ కొంతమంది కజిన్స్, బామ్మ, అత్తయ్యలతో సరదాగా గడిపేది. కానీ

అక్కడి సినిమాలూ, రాజకీయాలు ఏమీ అర్ధమయేవి కావు కూడాను. షాపింగ్ మీద అసలు సరదాయే లేదు. అందుకే మిగతా ఏ విషయాల్లోనూ అంటీ పట్టునట్టు గడిపేది. తెలుగు చదవటం రాకపోవటం వల్ల, అక్కడి పుస్తకాలకూ దూరమైంది. అక్కడ కనపడ్డ ఆధ్యాత్మిక ఇంగ్లీషు పుస్తకాలేవో పట్టుకుని, ఇష్టం లేకపోయినా పేజీలు తిప్పుతుండేది.

జెస్సికా తనూ చిన్నప్పటినించీ కలిసే పెరిగారు. ఇద్దరి ఇళ్ళూ దగ్గరే కనుక వాళ్ళ స్నేహం ఇంకా ఎక్కువయింది. ఇద్దరూ ఎలిమెంటరీ స్కూలు నించీ హైస్కూలు దాకా ఒకే క్లాసులో వుండేవారు. ఇద్దరూ కలిసే అక్కడే యూనివర్శిటీలో చదువుకున్నారు.

ఐదేళ్ల క్రితం జెస్సికా, బాబ్ పెళ్లి చేసుకున్నారు. తను వాళ్ళ పెళ్ళిలో వాళ్ళ కుటుంబంలోని ఒక వ్యక్తిగానే దగ్గర వుండి పెళ్లి జరిపించింది.

తర్వాత బాబ్ పనిచేసే కంపెనీ, అతనికి లండన్ బ్రాంచ్ నిర్వహణ బాధ్యత అప్పగించి, ప్రమోషన్ మీద ఇంగ్లాండ్ పంపించింది. జెస్సికా కూడా ఇష్టపడి, కొన్నేళ్ళు యూరప్ చూద్దామని అతనితో వచ్చి తనూ ఉద్యోగం చూసుకుని, లండన్లో స్థిరపడింది.

నాలుగేళ్ల క్రితం వాళ్ళిద్దరూ చికాగోనించీ, లండన్ వెడుతున్నప్పుడు చూడటమే. తర్వాత ఇద్దరూ ఎవరి జీవితాల్లో వాళ్ళు బిజీ అయిపోయారు. మధ్యేమధ్యే ఫోన్లో మాట్లాడుకోవటం తప్ప, ఇద్దరూ మళ్ళీ కలవలేదు.

బర్మింగ్హాంలో తన సబ్జెక్టులోనే ఒక్క సంవత్సరం రీసెర్చి చేయమని వాళ్ళంతట వాళ్లే పిలిచి ఫెలోషిప్ ఇస్తే, యూనివర్సిటీలో చేరటానికి వచ్చింది సమీర. ఎలాగూ వస్తున్నాను కదా అని, రెండు రోజులు జెస్సికాతో గడిపి, అక్కడికి వెళ్ళటానికి వీలుగా విమానం టిక్కెట్లు కొనుక్కున్నది.

అప్పుడే గుర్తుకొచ్చింది, ఇంకా అమెరికాకి ఫోన్ చేసి అమ్మకీ నాన్నకీ తను క్షేమంగా చేరినట్టు చెప్పలేదని.

సెల్ ఫోన్ తీసుకుని చికాగోలో ఇంటికి ఫోన్ చేసింది.

సమీర తల్లి సులోచన ఫోన్ తీసుకుంది.

“ప్రయాణం బాగా జరిగిందా, నాన్నా” అడిగింది సులోచన.

“అంతా బాగానే జరిగింది. జెస్సికా ఎయిర్పోర్టుకి వచ్చింది. నేనిప్పుడు దాని ఎపార్ట్మెంట్లోనే వున్నాను. ఆదివారం బర్మింగ్హాంకి వెడతాను. నాన్న ఉద్యోగానికి వెళ్ళాడా?” అడిగింది సమీర.

“అవును. ఏది తప్పినా అది తప్పదుగా మరి. మరిచిపోయాను. ఇందాకే నీ ఎపార్ట్మెంట్ లీజింగ్ ఏజెంట్ ఫోన్ చేసింది. అద్దెకి వుండటానికి ఎవరో ఒప్పుకున్నారుట. ఒక సంవత్సరం లీజ్. సాయంత్రం నాన్న వచ్చాక అగ్రిమెంట్ మీద నీ బదులు సంతకాలు పెడతారు” అంది సులోచన.

“గుడ్! ఇంకా విషయం గురించి వర్రీ అవక్ఖర్లేదు. మళ్ళీ బర్మింగ్హాం వెళ్ళాక పిలుస్తాలే” అంది సమీర.

తల మీద వేడి వేడి నీళ్ళతో స్నానం చేస్తుంటే హాయిగా వుంది సమీరకి.

బడలిక అంతా తీరినట్టుగా వుంది.

ఫ్రిడ్జ్ తెరిచి కనపడ్డవేవో తీసుకుని, మైక్రోవేవులో వేడి చేసుకుని తినేసింది.

జెస్సికా అపార్టుమెంటుని చాల శుభ్రంగా వుంచుతుంది.

తనకిచ్చిన బెడ్రూంలో తనూ, జెస్సికా కాలేజీలో తీసుకున్న ఫోటో చక్కటి ఫ్రేములో పెట్టి టేబుల్ మీద పెట్టింది జెస్సికా.

ఆ ఫోటోని చేతిలోకి తీసుకుని, పాత స్మృతులు మనసులో మెదులుతుంటే ఆ ఫోటోనే చూస్తూ మంచం మీద పడుకున్నది.

హైస్కూలు చదువు పూర్తయాక, తను మైక్రో బయాలజీ చదువుకుని పీహెచ్డీ కూడా చేసి, అక్కడే యూనివర్సిటీలో రీసెర్చి ఉద్యోగం చేయటం మొదలు పెట్టింది. తనకి ఎంతో ఇష్టమైన టీచింగ్ కూడా కొంత చేయటంతో ఇంకా బాగుంది.

జెస్సికా తన డిగ్రీ అవగానే, బయో మెడికల్ ఇంజనీరింగ్ చదివిన బాబ్ అంటే ఇష్టపడి అతన్ని పెళ్లి చేసుకుంది. ఇద్దరూ బిజీ అవటంతో అప్పుడప్పుడు ఫోన్, ఇంటర్నెట్ చాటింగ్ తప్పితే కొన్నేళ్లుగా వాళ్ళిద్దరూ మళ్ళీ కలవనే లేదు.

ఆలోచనలని వెనక్కి నెడుతూ నిద్ర ముంచుకు రావటంతో, ఒళ్ళు తెలియకుండా అలాగే నిద్రపోయింది సమీర.

○ ○ ○

అలా ఎంతసేపు నిద్రపోయిందో తెలియలేదు కానీ, బాబ్ వచ్చినట్టు శబ్దం వినపడుతుంటే చటుక్కున నిద్ర లేచి, ఒకసారి అద్దంలోకి చూసి జుట్టు సర్దుకుని లివింగ్ రూములోకి వచ్చింది సమీర.

బాబ్ సమీరని చూసి, 'హలో సమీ! వెల్కం టు ఇంగ్లండ్" అంటూ దగ్గరికి వచ్చి హగ్ చేసుకున్నాడు.

"ప్రయాణం బాగా జరిగిందా? కాసేపట్లో జెస్సీ వచ్చేస్తుంది" అన్నాడు.

సమీర తల వూపి, "ఎలా వున్నావ్ బాబ్!" అడిగింది.

"మొదట్లో ఇంగ్లడ్ జీవితం నచ్చలేదుగానీ, ఇప్పుడు అలవాటయిపోయింది. కాకపోతే ఇక్కడ అన్నిటి ధరలూ మన ఊరితో పోలిస్తే చాల ఎక్కువ" అన్నాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగా వచ్చింది జెస్సికా. "బాబ్ వచ్చేశాడా. అమ్మయ్య. నాకు కొంచెం ఆలస్యం అయింది. నీకు బోరు కొట్టేస్తుందేమో అనుకున్నాను. గుడ్ దట్ హి కేమ్ ఎర్లీ! మధ్యాహ్నం లంచ్ ఏమన్నా తిన్నావా" అంది నవ్వుతూ.

"ఆహా! సుబ్బరంగా తిన్నాను. హాయిగా నిద్ర పోయాను" అంది సమీర.

జెస్సికా ఫ్రిడ్జ్ తలుపులు తీసి, మూడు గ్లాసుల్లో ఆరెంజ్ జ్యూస్ పోసి వాళ్ళిద్దరికీ ఇచ్చి, తను కూడా తీసుకుని అక్కడ కూర్చుంది.

బాబ్ అడిగాడు, "బర్మింగ్హాంలో ఎన్నాళ్ళు నీ రీసెర్చి ఫెలోషిప్" అని.

"ఒక్క సంవత్సరం. అది కూడా ఇక్కడ బాగుంటే వుంటాను. లేకపోతే మధ్యలో వదిలేసి చికాగో వెళ్ళిపోతాను. అక్కడ యూనివర్సిటీలో నా ఉద్యోగం అలాగే వుంది. సెబాటికల్ తీసుకున్నాను కదా. అక్కడ బోరు కొట్టింది కనుక కొన్నాళ్ళు ఇలా వూళ్ళు తిరిగి, ఇక్కడ బోరు కొట్టగానే మళ్ళీ అక్కడికి వెడతాను" అంది సమీర నవ్వుతూ.

"అవును. మంచి ప్లాన్. సారీ, సమీ! నీ మేరేజ్ సరిగ్గా వర్కవుట్ అవలేదని జెస్సీ చెప్పింది" బాబ్ అన్నాడు, సమీరని చూస్తూ.

చిన్నగా నవ్వింది సమీర. "అవును. ఆ విషయం మరచిపోదామనే నేను అనుకుంటున్నాను. దూరంగా ఇక్కడికి రావటానికి కారణాల్లో అదొకటి" అంది.

"అసలేమయింది?" అడిగింది జెస్సికా.

సమీర అదోలా నవ్వి, "ఈ దేశంలో ఇంకా ఒక సంవత్సరం వుంటానుగా. తర్వాత వివరంగా చెబుతానులే. ఇప్పుడు సరదాగా మన ఆనాటి కాలేజీ కబుర్లు చెప్పుకుందాం" అంది.

బాబ్ కూడా నవ్వి, "ఒక గంటసేపు మాత్రమే మీకు మాట్లాడుకోవటానికి సమయం ఇస్తున్నాను. ఇంకా ఎక్కువసేపు అయితే మా దేశపు ఎలిజబెత్ రాణి ఒప్పుకోదు. అసలే ఆవిడకి కోపం ఎక్కువ. పనీపాటా లేని ఒక పరాన్నభుక్కు కదా. తర్వాత ముగ్గురం అలా బయటికి వెళ్ళి, కొంచెం లండన్ మహానగరం అందాలు చూసి, అక్కడే ఎక్కడో తినేసి ఇంటికి వచ్చేద్దాం. రేపు మళ్ళీ కాసేపు వూరు చూడటం. ఎల్లుండి ఆదివారం సమీర బర్మింగ్హాం వెళ్ళిపోతుంది. అదీ మన కార్యక్రమం" అన్నాడు.

"నేను లండన్ ఇంతవరకూ చూడలేదు.. ఏం చూపిస్తావ్ ఇక్కడ?" అడిగింది సమీర.

"ఇక్కడా, వెస్ట్ మినిస్టర్ ఆబ్బీ చూద్దాం, లండన్ ఐ, ట్రెఫాల్గర్ స్క్వేర్, బిగ్ బెన్, పార్లమెంట్ బిల్డింగ్, బకింగ్హాం పాలస్, చేంజింగ్ ఆఫ్ గార్డ్స్, థేమ్స్ నదీ తీర విహారం, టవర్ ఆఫ్ లండన్, ఎన్నో మ్యూసియంలు, స్కాట్లాండ్ యార్డ్... ఒకటేమిటి.. చాల వున్నాయి" అన్నది జెస్సికా.

"నువ్వేం చూడాలనుకుంటున్నావో చెప్పు. ఇవాళ కొన్ని, రేపు కొన్ని చూద్దాం" అన్నాడు బాబ్.

నవ్వింది సమీర. "నాకు ఇంకా పూర్తిగా నిద్ర తీరలేదు. కాసేపాగి అలా వెళ్ళి, లండన్ ఐ చూసి బయటే భోజనం చేసి త్వరగా వచ్చేద్దాం. ఇంకేదన్నా చూద్దామనుకుంటే రేపు చూద్దాం. ఇవాళ రాత్రి డిన్నర్ ఈజ్ ఆన్ మి" అంది సమీర.

"అలాగే.. ఇంగ్లండ్ నేషనల్ ఫుడ్ ఏమిటో తెలుసా?" నవ్వుతూ అడిగాడు బాబ్.

"ఫిష్ అండ్ చిప్స్" అంది సమీర.

"కాదు. కర్రీ.. ఇండియన్ కర్రీ" అన్నాడు పెద్దగా నవ్వుతూ బాబ్.

సమీర కూడా నవ్వుతూ, "అవును. నేనూ ఎక్కడో చదివాను అలా అని" అంది.

"ఆ మరచిపోయాను. నా కజిన్ బర్మింగ్హాంలోనే వుంటాడు. అతని పేరు నిక్. అక్కడే రెండు నెలల వెకేషన్ తీసుకుని వుంటున్నాడు. ఏం చేస్తున్నాడో అతనికే తెలియాలి. అతనికి నువ్వు వస్తున్నావని చెప్పాను. నీకు ఏ సహాయం కావాలన్నా సరే చేస్తానని చెప్పాడు. అక్కడ ఎయిర్పోర్టుకి వచ్చి నిన్ను రిసీవ్ చేసుకుని నీ ఎపార్ట్మెంటులో దించి వెడతాడు. సరేనా" అన్నాడు బాబ్.

"చాల థాంక్స్!" అంది సమీర నవ్వుతూ.

ఆరోజు సాయంత్రం జెస్సికా, బాబ్, సమీరని తీసుకుని లండన్ చూపించటానికి వెళ్లారు.

మొట్టమొదటగా లండన్ ఐ ఎక్కారు. అది ఆకాశమంత ఎత్తు వెడుతుంటే లండన్ నగరం అంతా ఎంతో అందంగా కనిపిస్తున్నది. అక్కడే చాల సమయం పట్టింది.

తర్వాత థేమ్స్ నదీ తీరంలో నడుచుకుంటూ వెళ్లి, దగ్గరలో వున్న ఇండియన్ రెస్టారెంటుకి వెళ్లారు.

"నా కోసం మీరు ఇండియన్ ఫుడ్ తినఖ్కర్లేదు. నేను ఏదయినా సరే తింటాను" అంది సమీర.

జెస్సికా నవ్వి, "నిజంగా చెప్పాలంటే ఇది నీ కోసం కాదు. బాబ్ ఇండియన్ ఫుడ్, ముఖ్యంగా స్పైసీ వెజిటబుల్ బిర్యానీ, మాంగో లస్సీ అంటే పడి చస్తాడు. మూడు రోజులనించీ ఒకటే చెబుతున్నాడు, సమీ రాగానే ఇండియన్ రెస్టారెంటుకి వెళ్లాలని" అన్నది.

బాబ్ కూడా నవ్వి, "నేను అలా అన్నమాట నిజమే కానీ, జెస్సీకి కూడా ఇండియన్ ఫుడ్ అంటే ఇష్టమే. పైకి మాత్రం అంతా నా కోసమే అన్నట్టు చెబుతుంది" అంటూ లోపలికి నడిచాడు.

భోజనాలు చేస్తున్నప్పుడు జెస్సికా అడిగింది, "కాలేజీలో నాతోపాటు ఇంకో ఇండియన్ అమ్మాయి చదివేదే.. సన్నగా, పొడుగ్గా, ఎంతో అందంగా వుండేది. కొంచెం రిజర్వుడుగా కూడా వుండేది. ఆ అమ్మాయి నీకూ బాగా తెలుసు కదా? ఎక్కడ వుంది? ఎలా వుంది?"

సమీర నవ్వింది. "నీకు వనజ బాగా గుర్తుందే.. అవును. చాల అందంగా వుంటుంది. చికాగోలోనే మాకు దగ్గర్లోనే వుంటుంది. అక్కడే ఏదో కంపెనీలో పనిచేస్తున్నది. కెమికల్ ఇంజనీరు కదా" అంది.

"వనజ పెళ్లి చేసుకుందా?" అడిగింది జెస్సికా.

"అవును. పెళ్లయి రెండేళ్లయిందేమో. ఇండియా వెళ్లి అక్కడే పుట్టి పెరిగిన అబ్బాయిని పెళ్లి చేసుకుంది. ఇద్దరూ బాగా కలిసిపోయి ఆనందంగా వున్నారు. అప్పుడప్పుడూ కలుస్తూనే వుంటాం" అంది సమీర.

జెస్సికా ఆశ్చర్యంగా అడిగింది, “డేటింగ్ ఏమీ చేయకుండానే పెళ్లి చేసుకుందా? మరి వనజ అమెరికాలోనే పుట్టి పెరిగిన పిల్ల కదూ” అని.

సమీర చిన్నగా నవ్వి, “అవును. వనజ నాలాగానే అమెరికాలోనే పుట్టి పెరిగిన పిల్ల. వాళ్ళ చుట్టాలకి ఎవరో తెలిసిన అబ్బాయి ఇండియాలో వున్నాడని చెబితే అక్కడికి వెళ్లి, అక్కడికక్కడే పెళ్లి నిశ్చయం చేసేసుకుని, పెళ్లి కూడా చేసుకుని వచ్చేశారు. అంతా పది రోజుల్లో అయిపోయింది. నా పెళ్లి కూడా దాదాపు అంతే అనుకో” అంది.

జెస్సికా ఇంకా ఆశ్చర్యపోతూ అంది, “నీ పెళ్లి విషయం తీరిగ్గా తర్వాత చెబుతానన్నావు కదా, అందుకని ఆ వివరాలు అడగను. కానీ నాకెప్పటినించో మనసులో వున్న ప్రశ్న ఏమిటంటే.. మీ ఇండియాలో ఏమీ డేటింగ్ చేయకుండా చేసుకునే అరేంజ్డ్ పెళ్ళిళ్ళు ఎలా విజయవంతం అవుతాయా అని”

బాబ్ కూడా ఎంతో ఆశ్చర్యంతో కన్నార్పకుండా చూస్తున్నాడు.

సమీర మళ్ళీ చిన్నగా నవ్వుతూ అంది, “కొన్ని దశాబ్దాల క్రితం ఇలా కుదుర్చుకున్న పెళ్ళిళ్ళు బాగానే వుండేవి. మా అమ్మా నాన్నా, అత్తయ్యలూ మామయ్యలూ, అందరూ నలభై, ఏభై ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని ఇంకా సుఖంగా కలిసే వుంటున్నారు. కానీ కొన్నేళ్ళనించీ అంతా మారిపోయింది. పాశ్చాత్య నాగరికతా ప్రభావమో, స్త్రీలకి ఆర్థిక, వ్యక్తిత్వ స్వాతంత్రం పెరగటంవల్లో పరిస్థితులు మారిపోయాయి. ఏది మంచిది, ఏది చెడ్డది అనే వాదన లేదిక్కడ. ఎందుకంటే ఆ రోజుల్లో అది మంచిది, ఈ రోజుల్లో ఇది మంచిది” సంస్కృతిలోని మార్పుల్ని నాలుగు మాటల్లో చెప్పింది సమీర.

“దట్ మేక్స్ సెన్స్” అన్నాడు బాబ్.

“మరలా అయితే ఈరోజుల్లో కూడా నువ్వూ, వనజా పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు ఎందుకు చేసుకున్నారు? అందులోనూ అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలు కదా మీరిద్దరూ” అడిగింది జెస్సికా.

సమీర నవ్వింది. ఏమీ జవాబివ్వలేదు. అంటే ఆమెకీ విషయంలో ఎందుకో జవాబు చెప్పటం ఇష్టం లేదని అర్థమయింది.

అందుకే జెస్సికా విషయం మారుస్తూ అంది. ‘బిరియానీ అంతా బాబ్ ఒక్కడే ఖాళీ చేశాడు చూడు’

“ఇంకో ప్లేట్ తెప్పిద్దామా?” అడిగింది సమీర.

“వద్దు.. వద్దు.. నాకు కడుపు నిండిపోయింది” అన్నాడు బాబ్.

జెస్సికా, సమీర ఏవేవో వాళ్ళ మిత్రుల గురించి చాల విషయాలు మాట్లాడుకుంటున్నారు. మధ్యేమధ్యే సమీర కోపం తెచ్చుకుని ఏదేదో మాట్లాడేస్తున్నది. మళ్ళీ నవ్వుతూ మాట్లాడుతున్నది.

బాబ్ ఇవేమీ పట్టించుకోకుండా, అక్కడ గోడకు పెట్టిన టీవీలో ఏవో హిందీ సినిమా డాన్సులు వస్తుంటే చూస్తున్నాడు.

కాసేపయాక "రాత్రి కూడా సరిగ్గా నిద్రపోలేదేమో నాకు బాగా నిద్ర వస్తున్నది. వెడదామా" అంది ఆవలిస్తూ సమీర.

కారులో జెస్సికా ఏదో మాట్లాడుతున్నదే కానీ, వెనక సీట్లో కునికిపాట్లు పడుతూ మధ్యమధ్యలో మేలుకుని, సభ్యత కోసం ఊఁ కొడుతున్నది సమీర.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments